
# రసాభాస

చంద్రం



రామనాథం నా చిన్ననాటి స్నేహితుడు. సుదీర్ఘ కాలం ప్రభుత్వోద్యోగం చేసి ఇటీవలే రిటైరయ్యాడు.

ఓ చల్లని సాయంకాలం అలా వ్యాహ్యాళికి వెళుతుండగా తన మనసులోని మాట బయట పెట్టాడు రామనాథం - "ఉద్యోగం పోయినందుకు నాకు బాధగా లేదు. ఇవ్వాళ కాకపోతే రేపైనా తప్పదు. అయితే, సంపూర్ణారోగ్యంతో ఉన్నవాణ్ణి వయసైపోయిందని చెప్పి ఇంటికి పొమ్మనడం ఎంతవరకు సమంజసం? అన్నదే నా ప్రశ్న!"

"నీ ప్రశ్న సమంజసమైనదే కానీ, రూల్సు అలా ఉన్నప్పుడు ఎవరు మాత్రం ఏం చేస్తారు? పాటించక తప్పదు కదా!" ఇది నా సమర్థింపు.

"రూల్సనేవి కొందరికేనా?" అతని సూటి ప్రశ్న.

"అదేం మాట? అందరికీను!" నా తక్షణ ప్రశ్నకు సమాధానం. ప్రశ్నకు సమ్మాధానం చెప్పాను కాని అతని ఆంతర్యం అర్థం కాలేదు.

అతనన్నాడు "పరిమితమైన ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించటానికి ఎన్నెన్నో కఠిన నిబంధనలు. బ్రహ్మాండమైన పరిపాలనా భారాన్ని నిర్వహించేందుకు అలాంటివేమీ అక్కర్లేదు!"

అతని ఆలోచనా ధోరణి అర్థమైంది నాకు.

మళ్ళీ అతనే అన్నాడు: "ఉదాహరణకి వయస్సు విషయమే తీసుకుందాం. చిన్న ఉద్యోగంలో ప్రవేశించటానికి కనిష్ఠ గరిష్ఠ వయోపరిమితులున్నాయి. విరమణ వయస్సు కూడా నిర్ణయించి పెట్టారు. ఒక్కరోజు అటూ యిటూ కావడానికి వీల్లేదు. నిబంధనలన్ని ఖచ్చితంగా పాటించి తీరాలి. ఆదే విధానం రాజకీయాల్లో లేదు. లక్షలాది మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అసెంబ్లీ - పార్లమెంట్ మెంబర్లకు గానీ, రాష్ట్ర - కేంద్ర మంత్రులకు గానీ ఈ వయస్సు ప్రతిబంధకాలు లేవు. ఎన్నికలలో నిలబడటానికి కనీస వయస్సుంటే చాలు. గరిష్ట వయోపరిమితి లేదు. రిటైర్మెంటనేది స్వచ్ఛందమే గాని బలవంతం కాదు. ఓపి కున్నంత కాలం కొనసాగవచ్చు. మూడుకాళ్ళ ముదుసలి కూడా మంత్రి పదవిలో ఉండవచ్చు గానీ పిడిరాయిలా ఉన్నా ఉద్యోగస్థుడు మాత్రం వయసైపోయిన తర్వాత ఒక్క రోజుకూడా ఉద్యోగంలో ఉండటానికి వీల్లేదు!"

ఉద్యోగస్థులకీ, రాజకీయ నాయకులకీ పోలికేమిటి తెలివి తక్కువ తనం కాకపోతే! వీళ్ళు వీళ్ళే, ఆ విషయమే వివరించటానికి ప్రయత్నించాను.

"చూడు రామనాథం! 'రాజకీయ తీర్థం' ఒక్కసారి పుచ్చుకుంటే చాలు - ఎలాంటివాడయినా సర్వజ్ఞుడూ, సర్వ సమర్థుడూ అయి కూర్చుంటాడు. వాళ్ళ సర్వజ్ఞత్వానికీ, సర్వసమర్థతకూ చక్కటి ఉదాహరణ చెప్తాను విను. అక్షర జ్ఞాన శూన్యుడు విద్యాశాఖను నిర్వహించగలడు. వైద్య శాస్త్రంలో ఓనమాలు తెలీని వాడు వైద్యశాఖామాత్యుడుగా విఖ్యాతి నొందగలడు. భారత దేశపు ఎల్లలు తెలీని వాడు రక్షణ మంత్రి గానూ, విదేశాంగ మంత్రిగానూ రాణించగలడు. ఇంకా విచిత్రం ఏమిటంటే ఒకే వ్యక్తి ఏకకాలంలో అనేక శాఖలు నిర్వహించగలడు. రోజు కో శాఖ చొప్పున మార్చినా అంత సమర్థతనూ కనబర్చగలడు. రాజకీయ నాయకులకు వయస్సుతో నిమిత్తం లేదు. రాజకీయ తీర్థం అమృతం లాంటిది. అమృతం తాగిన దేవతలకు రోగాలూ, ముసలితనం లేనట్టే వీరికీ వార్ధక్య భయం లేదు. అందుకనే వాళ్ళకి రిటైర్మెంట్ సమస్య ఉండదు. అర్థమైందా?"

"అర్థమైంది" అన్నాడు రామనాథం.

విషయం అర్థమైనా రాజకీయ నాయకుల పట్ల అతనికేర్పడిన దురభిప్రాయం మాత్రం తొలగిపోయిన సూచనలు అతని ముఖంలో కనిపించలేదు. అది అంత సులభ సాధ్యం కాదని నాకూ తెలుసు. ఇది విషయాంతరం.

ప్రస్తుత సమస్య ఏమిటంటే - రిటైరైన తర్వాత దొరికిన విశ్రాంతి సమయాన్ని వృధా చెయ్యలేదు రామనాథం. చందోబద్ధంగా ఓ రసవత్కావ్యాన్ని రచించి, రిటైర్మెంట్ బెనిఫిట్‌గా వచ్చిన సొమ్ములోంచి కొంత వెచ్చించి, అందంగా అచ్చొత్తించాడు కూడాను. పద్య రచన చాలా కాలంగా చేస్తున్నా, అది ముక్తకాలుగానూ, ఖండికలగానూ సాగింది. ఒక సమగ్రకావ్యం రాయటం, అచ్చు వెయ్యటం ఇదే ఓం ప్రథమం.

ఏమీ లేని వాళ్ళే సొంత డబ్బా వాయించు కుంటున్న రోజులివి. అడపా తడపా పత్రికలలో రాస్తూ, ప్రస్తుతం ఓ పుస్తకం కూడా అచ్చు వేయించుకున్న రామనాథం, కొంత ప్రచారాన్ని ఆశించటంలో అసహజమేమీ లేదు. కీర్తి కండూతి కళాకారుల సహజ లక్షణం కదా! ఉన్న ఊళ్ళో నలుగురి మధ్యా కవిగా గుర్తింపు పొందాలని రామనాథం తహతహ. అది తీరేదెలా? నన్ను సంప్రదించాడు. అతని కోరిక న్యాయమైనదే కనుక బాగా ఆలోచించి 'గ్రంథావిష్కరణ సభ' జరిపితే బావుంటుందని సలహా చెప్పాను.

"అది మన వల్ల సాధ్యమా?" అని సందేహం వెలబుచ్చాడు రామనాథం వెంటనే.

నిజమే. అన్ని పనులూ అందరికీ సాధ్యం కావు. కొన్ని పనులు కొందరే చెయ్యాలి.

రామనాథాన్ని సన్మాన సామ్రాట్ గారింటికి తీసుకు వెళ్లాను.

సన్మాన సామ్రాట్టన్నది ఆ వ్యక్తి యొక్క గౌరవ నామమేగాని, అసలు పేరు కాదన్నది స్పష్టంగా తెలుస్తున్న విషయమే. అయితే ఆయన అసలు పేరేమిటో నాకూ తెలీదు. ఆ మాట కొస్తే ఆయనతో నాకు పరిచయం కూడా లేదు. కాని, ఆయన ద్వారా మా రామనాథం పని సానుకూలం కావచ్చునన్న ఉద్దేశం నాకు కలిగింది. అందుకు కారణం మా ఊళ్లో జరిగే ప్రతి సభలోనూ ఈయన పాత్ర దర్శనమి స్తుండటమే!

అదృష్టవశాత్తు మేము వెళ్లేసరికి సన్మాన సామ్రాట్టు ఇంటి దగ్గరే ఉన్నాడు.

కుర్చీలో కూర్చోమని "పనేమిటి చెప్పండి?" అని సూటిగా అడిగేశాడు.

"గ్రంథావిష్కరణ జరిపించాలి" అన్నాన్నేను.

"గ్రంథావిష్కరణ ఒక్కటేనా? కవి సన్మానం, బిరుదు ప్రదానం, వగైరా ఏమీ అక్కర్లేదా?

"అలాంటివి కూడా జరిపిస్తారా?" ఆశ్చర్యంగా

అడిగాన్నేను.

ఆయన ఓ చిర్నవ్వు విసిరి "మా గురించి మీకు పూర్తిగా తెలిసినట్టు లేదు. ఓపిక ఉండాలే కాని, కనకాభిషేకం, గజారోహణ లాంటివి కూడా చేయించగలం" అని ఓ చార్టు నా చేతికందించాడు.

అందులో ఐటం వారీగా అన్నింటికి రేట్లు ముద్రించి ఉన్నాయి.

చార్టు రామనాధానికి కూడా చూపించి "ఏం చేద్దాం?' ' అని అడిగాను.

రేట్లన్ని పరిశీలించి "ఇంతింత ఖర్చు ఇప్పుడు మన మెక్కడ భరించగలం? గ్రంథావిష్కరణ ఒక్కటే చాలు మనకు" అన్నాడు రామనాధం.

వెంటనే సన్మాన సామ్రాట్ అందుకున్నాడు - మీరేది కావాలంటే అదే చేస్తాం. అయితే అనుభవం మీద నేనో సలహా ఇస్తాను. గ్రంథావిష్కరణ ఒక్కటే పెట్టుకున్నా సభానిర్వహణ కయ్యే ఖర్చు తప్పదు కనుక, పనిలో పనిగా కవి సన్మానం; బిరుదు ప్రదానం కూడా జరిపించేసుకుంటే అదే సభలో అన్నీ కొట్టుకు పోతాయి కనుక చాలా ఖర్చు కలిసొస్తుంది. అలా కాక, మరోసారెప్పుడన్నా కవిసన్మానం గానీ, బిరుదు ప్రదానం గానీ విడిగా కావాలనుకుంటే మళ్లీ సభ కూడా ఏర్పాటే చేసుకోవాలి గనుక ఆ ఖర్చు ఎక్స్ట్రా అవుతుంది. ఆలోచించుకుని చెప్పండి.

ఖర్చులో ఖర్చు. ఎలాగూ కొంత కలిసొస్తుంది గనుక కవి సన్మానం బిరుదు ప్రదానం కూడా కానిచ్చేస్తే బావుంటుందని నా ఆలోచన. అదే రామనాధంతో అన్నాను. అతడు కూడా ఆలోచనలో పడ్డాడు.

"ఇంతకీ ఏ బిరు దిస్తారు మీరు? సన్మాన పత్రం ఏం రాస్తారు?" అనడిగాను కుతూహలంగా సన్మాన సామ్రాట్‌ని.

"మీరు కోరుకున్న బిరుదిస్తాం. మీరిచ్చిన వివరాల ప్రకారం సన్మాన పత్రం రాయిస్తాం. ఆహ్వాన పత్రాలు వేయిస్తాం. సభాధ్యక్షునితో పాటు శ్రోతల్ని కూడా మేమే ఏర్పాటే చేసుకుంటాం. ప్రతిదీ సక్రమంగా జరిగిపోతుంది. పట్టికలో చూపిన విధంగా ఫీజు కట్టటం మీ వంతు. పని జరిపించటం మా వంతు."

ఈ లోగా ఆలోచన పూర్తిచేసి "గ్రంథా విష్కరణ' ఒక్కటే చాల్లెండి" అని తేల్చి చెప్పాడు రామనాధం.

"అలాగే. తేదీ ఏదైనా నిర్ణయించుకున్నారా?" అడిగాడు సన్మాన సామ్రాట్.

"మేమేదీ నిర్ణయించుకోలేదు. సాధ్యమైనంత త్వరలో జరిపించండి" అన్నాన్నేను.

వెంటనే సన్మాన సామ్రాట్ ఓ డైరీ తిరగేసి "పదిహేను రోజులలో ఓ మంత్రిగారిటు వేపొస్తున్నారు. గ్రంథావిష్కరణకి ఆయన్ని ఫిక్స్ చేసేస్తాను. బ్రహ్మాండంగా ఉంటుంది" అన్నాడు.

"మంత్రిగారా?" అని చప్పరించేశాడు రామనాధం.

నాకు తెలుసు. రాజకీయాలన్నా, రాజకీయ నాయకులన్నా రామనాధానికి సుతరామూ నచ్చదు. ఆ సంగతి సన్మాన సామ్రాట్‌కి తెలీదు కదా. అందుకనే "నిజంగా ఇది మీ అదృష్టమే అనుకోండి. సమయానికి మంత్రిగారొస్తున్నారు. ఇలాంటి అవకాశం అందరికీ రాదు!" అనేశాడు హుషారుగా.

"సాహిత్య సభలకి రాజకీయనాయకు లెందు కండి?' ' అన్నాడు మళ్ళా రామనాధం.

సన్మాన సామ్రాట్ మా ఇద్దర్నీ మార్చి మార్చి చూసి "ఇంతకీ మీలో కవి ఎవరు?" అనడిగాడు.

కావటానికి నేనూ ఓ కవినే గనుక, సందర్భం రామనాధానికి సంబంధించిందే అయినా- "ఇద్దరమూ కవులమే" అని చెప్పాలని కుతూహల పడ్డాను. కానీ, అతని వాలకం చూస్తే మెచ్చుకోవడానికి అడుగుతున్న సూచనలు కనబడక పోవడం చేత నా కుతూహలాన్ని బలవంతంగా ఆపుకుని "ఈయనే" అని రామనాధాన్ని చూపించాను.

ఓసారి రామనాధాన్ని ఎగాదిగా చూసి, నావంక తిరిగి అన్నాడు సన్మాన సామ్రాట్టు "ఈ కవులతో వచ్చిన చావు ఇదేనండి ! ఎంతసేపూ ఊహా లోకాల్లో విహరించడమే తప్ప వ్యవహార జ్ఞానం బొత్తిగా ఉండదు. సాహిత్య సభంటే ఈ రోజుల్లో ఎవడొస్తాడు చెప్పండి. పట్టుమని పదిమంది వస్తే అదో పెద్ద సక్సెస్‌గా చెప్పుకోవచ్చు. అదే ఓ మంత్రిగార్ని పెట్టుకున్నా మనుకోండి - వారి పార్టీ మనుషులు, అభిమానులు, హంగుదార్లు ... తండోపతండాలుగా వచ్చి పడతారు. పోలీసు బందోబస్తు ఉంటుంది. పిలవకపోయినా పత్రికలవారు పరిగెత్తుకొస్తారు. మరుసటి రోజు పేపర్లలో బ్రహ్మాండమైన కవరేజీ. అసలు మనం సభ జరుపుకునేది దేనికి? - పబ్లిసిటీ కోసమే కదా ! ఆ పబ్లిసిటీ ఏ మార్గంలో ఎక్కువ వచ్చే అవకాశం ఉంటే ఆ మార్గాన్నే మనం అనుసరించాలి. ఏమంటారు?"

అతని వాదన సమర్థనీయంగానే కనిపించింది నాకు. రామనాధం ఏదో చెప్పబోయాడు. నేను అడ్డుకున్నాను. "ఊరుకోవోయ్ రామనాధం! 'రాజకీయం' అనే మాట నీకు పడదని నాకు తెలుసు. కానీ, ఇక్కడి సందర్భం వేరు. మంత్రిగారి రాకవల్ల సభాగౌరవం పెరుగుతుందే తప్ప సాహిత్యం సంకరం అయిపోదు కదా! ఆవిష్కరణ మాత్రం మంత్రిగారు చేస్తారు. కవిని గురించి, కావ్యం గురించి మాట్లాడటానికి ఇద్దరు ముగ్గురు సాహితీ మిత్రుల్ని మనమే ఏర్పాటు చేసుకుంటే సరి."

ఇంత చెప్పినా రామనాధం ముఖం ప్రసన్నం కాలేదు. అయినా నేనే చొరవ తీసుకుని సన్మాన సామ్రాట్‌గారితో చెప్పేశాను - "అలాగే కానివ్వండి!" అని.

సగం ఫీజు ఇస్తే కార్యక్రమం మొదలవుతుందనీ, మిగిలిన సగం సభ జరగడానికి రెండు రోజుల ముందే చెల్లించెయ్యాలని ఖచ్చితంగా చెప్పాడు సన్మాన సామ్రాట్టు.

"అలాగే. రేపు సాయంత్రం వచ్చి సగం ఫీజుతో పాటు అవసరమైన వివరాలు గూడా ఇచ్చి వెళ్తాం" అని చెప్పి బయట పడ్డాం.

బయటి కొచ్చిన తర్వాత గూడా రామనాధం గునుస్తూనే ఉన్నాడు - 'మంత్రి' గురించి.

"మంత్రి బదులు ఓ ఎలిమెంటరీ స్కూలు విద్యార్థితో గ్రంథావిష్కరణ జరిపిస్తే నాకు ఎక్కువ ఆనందం కలుగుతుంది!" అన్నాడు రామనాధం.

అతని ఆంతర్యం అంతుబట్టలేదు నాకు. అయినా "మరీ అంత దారుణంగా మాట్లాడుతావేమిటోయ్ రామనాధం? మంత్రులంటే అంత కోపం ఎందుకోయ్ నీకు?" అన్నాను.

"కోపం కాదోయ్ - బాధ. సన్మాన సామ్రాట్ చెప్పిన మంత్రి గారి గురించి తెలీదా నీకు? ఆ మహానుభావుడికి తెలుగు పేపరు కూడా చదవటం రాదు. నిరక్షరకుక్షి. అలాంటి నిరక్షరాస్యుడి చేత గ్రంథావిష్కరణ చేయించుకోవటం కన్న తెలుగు చదవనేర్చిన ఎలిమెంటరీ స్కూలు విద్యార్థితో చేయించటం ఉత్తమం కాదంటావా?" అని దీర్ఘంగా నిట్టూర్చాడు.

సమస్యను తేలిక పరిచే ఉద్దేశంలో "ఎలిమెంటరీ స్కూలు విద్యార్థితో గ్రంథావిష్కరణ జరిపిస్తే సభకు జనాలు రారోయ్ !" అన్నాను నవ్వుతూ.

మొత్తంమీద నా మాట కాదనలేక అయిష్టంగానే అంగీకరించాడు రామనాధం.

అయితే వక్తలుగా బయటి వాళ్ల నెవ్వర్నీ పిలవద్దనీ, నన్నే నాలుగు మాటలు చెప్పమనీ అన్నాడు. సరే నన్నాను.

* * *

సన్మాన సామ్రాట్ సామాన్యుడు కాదు - సభలు నిర్వహించటంలో ఆరితేరిన చెయ్యి.

వేదిక చూడముచ్చటగా తయారయింది.

పెద్దవాళ్ళతో పనిగనుక కాస్త ఆలస్యంగా మొదలైంది. అయితేనేం - అశేష జనసందోహం !

సభ అన్నతర్వాత ఏవో కొన్ని మర్యాదలు పాటించాలి కదా ! అవన్నీ అయిన తర్వాత గ్రంథావిష్కరణ వంతు



**టైము మారింది**

"ఈ మధ్య ఆలస్యంగా పాలు తెచ్చి పోస్తున్నావేంటి ?" పాలామెను అడిగింది వనజాక్షి

"మరి, టైము మారింది కదండీ!"

"దేనికి?"

"కొళాయిలో నీళ్ళు రావడానికి!"

"!!"

\- అండే అనిత (చిత్తూరు)

వచ్చింది.

రామనాధం రాసిన గ్రంథం తాలూకు ఓ పది ప్రతులు ఓ రంగు కాగితంలో చుట్టి, దానికి ఓ రిబ్బను కట్టారు. ఆ పొట్లాన్ని మంత్రిగారి ముందుంచి, ఆవిష్కరించమన్నాడు సన్మాన సామ్రాట్.

"మరి కత్తిరేదీ?" అన్నాడు మంత్రిగారు వేళ్ళతో కత్తిరిస్తున్నట్లు సంజ్ఞ చేస్తూ.

సన్మాన సామ్రాట్ తెల్లబోయి "గ్రంథావిష్కరణకి కత్తెర అక్కర్లేదు సార్ !" అన్నాడు.

"మరి దేంతో చేత్తారు! పళ్ళతో కొరికెయ్యనా?" అన్నాడు వెకిలిగా నవ్వుతూ - అదేదో జోకన్నట్టు.

సన్మాన సామ్రాట్ కంగారు పడిపోయాడు. 'అబ్బే అది కాదు సార్! రిబ్బనుతో వేసింది జారుముది సార్! ఒక కొస పట్టుకు లాగితే ఊడిపోతుంది సార్!' అన్నాడు ఎంతో వినయంగా.

మంత్రిగారు మళ్ళీ నవ్వాడు. 'ఏమయ్యా నీకంటికి నేనెలా కనిపిత్తన్నాను?" అన్నాడు సూటిగా సన్మాన సామ్రాట్ వంక చూస్తూ.

సన్మాన సామ్రాట్ కేమీ అర్థంగాలేదు. తెల్లమొహం వేశాడు.

మళ్ళీ మంత్రిగారే అన్నాడు - "చూడూ. ఈ రిబ్బనుతో ఏసింది జారు ముడేననీ, ఒక కొస పట్టుకు లాగితే జారు ముడి ఊడి పోద్దనీ తెలీకుండానే కేబినెట్టు మంతిరి గా ర్నయ్యా ననుకున్నావా? ఎల్లెల్ల వయ్యా ! అరిజెంటుగా యెల్లి ఓ కత్తి రట్టుకురా. ఎల్లూ!" అని గద్దించాడు.

పాపం సన్మాన సామ్రాట్ ఇరకాటంలో పడిపోయాడు. అయినా ఆశ చావలేదు. నచ్చచెబితే వింటాడనే దృష్టిలోనే ఉన్నాడు - "గ్రంథావిష్కరణలు రిబ్బను ఊడదీసే చేస్తారు సార్ ! అదే రివాజు !" అన్నాడు వినయంగా.

"ఆహాఁ! అదా రివాజు ? ఎవుడు బెట్టాడయ్యా ఆ రివాజు? ఒకేళ ఏ సన్నాసోడో అలాంటి రివాజు బెట్టాడే అనుకో - అందరూ అదే పాటించాలని రూలా? ఎవుడికి వచ్చినట్టు ఆడు చేసుకుంటాడు. ఆ మాట కొత్తే ఇప్పుడు నేను రిబ్బను కత్తిరించే ఈ గెందాన్ని పేరంబిత్నాను. కాదనే మొగాడెవుడో రమ్మను !" అన్నాడు ఛేలంజి చేస్తున్నట్టు మంత్రిగారు.

ఈలోగా మంత్రిగారి అనుయాయు డొకడు సన్మాన సామ్రాట్‌ని పక్కకి పిలిచి అతని చెవిలో ఏదో ఊదాడు. బహుశ కత్తెర లేనిదే పని జరగదని చెప్పి ఉంటాడని ఊహించాను. హడావుడిగా వేదిక దిగి పరిగెత్తాడు సన్మాన సామ్రాట్.

సన్మాన సామ్రాట్ వేదిక దిగడానికి కొంచెం ముందే రామనాధం కూడా వేదిక దిగి వెనక్కి వెళ్ళాడు. ప్రేక్షకుల్లో ముందు వరసలో కూర్చొని ఉన్న నేను అతను వేదిక దిగటం చూశాను కానీ, మంత్రిగారి మాటల మజాలోపడి అంతగా పట్టించుకోలేదు. అయితే సమస్యను పొడిగించటం ఇష్టంలేక కత్తెర తెచ్చే ఉద్దేశంతోనే అతను వేదిక దిగి వుంటాడని తర్వాత ఊహించాను.

అయిదు నిమిషాల్లోనే ఓ పెద్ద కత్తెరతో తిరిగి వచ్చాడు సన్మాన సామ్రాట్. బహుశ దగ్గర్లో ఉన్న ఏ టైలరింగ్ షాపువారినో అడిగి తెచ్చి ఉంటా డనుకున్నాను.

కత్తెర చూడగానే మంత్రిగారి ముఖ కమలం వికసించింది. కత్తెర్ని చూసిన ఆనందమో లేక తన మాటే నెగ్గిందన్న ఆనందమో తెలీదు మరి !

ఒకసారి కత్తెర పైకెత్తి చూపించి, ఎడమ చేత్తో పుస్తకాల పొట్లం మైకు ముందు పట్టుకుని, కుడిచేత్తో కత్తెర పట్టుకుని పర్రున రిబ్బన్ కత్తిరించేశారు మంత్రిగారు.

ఫ్లాష్ కెమెరా క్లిక్ మంది.

చప్పట్లతో సభ మారుమోగి పోయింది.

అప్రయత్నంగా అందరితోపాటు నేనూ చప్పట్లు చరిచాను. కాని నా కళ్ళు రామనాథం కోసం వెదక సాగినయ్. రామనాథం వేదిక దిగటం చూశాను. కాని, ఎక్కడికి వెళ్ళాడో తెలీదు. బహుశ కత్తెర కోసమే వెళ్లాడనుకున్నాను. ఇంతవరకు తిరిగిరాలేదు. గ్రంథకర్త లేకుండానే గ్రంథావిష్కరణ జరిగిపోయింది. సభా నిర్వాహకుడు గానీ, ఫోటోగ్రాఫర్‌గాని, ఆ విషయాన్ని గమనించినట్టు లేరు. ఒకవేళ గమనించినా పట్టించుకోలేదేమో ! నా మనసు చివుక్కుమంది.



**మరిచాను**

"అమ్మాయి బొమ్మగీసి టీచర్ గార్కి చూపిస్తే కొట్టిందిరా.....!"

"ఏం.... బొమ్మ సరిగా వేయ్యలేదా?"

"వేశాను కానీ... బట్టలేయడం మరిచాను.!!"

"ఆఁ...............!!!???"

**- జె. ప్రమీలారాణి (విజయవాడ)**

ఈలోగా పొట్లం విప్పి ముందువరసలో కూచున్న కొంతమంది పెద్దలకి పుస్తకాలు పంచాడు సన్మాన సామ్రాట్.

అప్పటికీ రామనాధం రాకపోయేటప్పటికి నాలో అసహనం పెరిగిపోయింది. అంతా జరగరాని పద్ధతిలో జరుగుతున్నట్టు నా కనిపించింది.

"గెందావిస్కరన అయిపోయింది. అభిమానంతో నన్ను పిల్చి, పెద్ద సంకెలో మీరొచ్చి ఈ సబని జెయప్రెదం చేసినందుకు నాకు శానా యిదిగా వుంది. దండాలు. నాకింకా యియ్యాల యింకో రెండు పేరంబోత్సవా లున్నాయి. ఇప్పటికే కాలాతీతం అయిపోయింది. కనక, యింక సెలవిప్పించండి. వత్తా!" అని వేదిక దిగిపోయారు మంత్రిగారు.

మంత్రిగారితోబాటు వారి అనుయాయులంతా కార్లమీద, రకరకాల వాహనాల మీద వెళ్లి పోయారు. వాళ్లని చూడటానికి వచ్చిన జనాలలో చాలామంది కూడా లేచిపోయారు. ఐదు నిమిషాలలో సభాప్రాంగణం అంతా ఖాళీ అయిపోయింది. ఓ పది పదిహేను మంది మాత్రం సభ ఇంకా పూర్తి కాలేదన్న అనుమానంతో లేవాలా, వద్దా అని మీమాంస పడుతుండగా సన్మాన సామ్రాట్ మైకు ముందు కొచ్చి వందన సమర్పణ చెప్పేశాడు. దాంతో అధికారికంగా సభ ముగిసి పోయింది.

అంతా అయోమయమై పోయింది నాకు. చేసేది లేక ఉసూరు మంటూ లేచాను.

ఇంతకీ ఈ రామనాధం ఏమైపోయినట్టు?

గ్రంథకర్త వేదిక మీద లేకుండానే గ్రంథావిష్కరణ జరిగిపోయింది !

అసలు మొదట వేదిక మీదకి ఆహ్వానించేటప్పుడే కొంత అసహజత్వం కనిపించింది నాకు. వెయ్యటానికి పది పెద్ద కుర్చీలు వేశారు వేదిక మీద. అయితే మంత్రిగారూ, స్థానిక ఎమ్మెల్యే, ఎంపి, వగైరా రాజకీయ పెద్దలకే ఆ కుర్చీలన్నీ సరిపోయాయి. కవిగారి దగ్గర కొచ్చే సరికి కుర్చీ మిగల్లేదు. చివరికి ఓ డొక్కు కుర్చీ తెచ్చి ఓ చివరగా వేసి కూచోబెట్టారు ! ఆ సభ అతనికి సంబంధించినదిగా కనిపించలేదు.

కొద్ది నిమిషాలు ఆ పరిసరాలలోనే తచ్చాడాను రామనాధం కనిపిస్తాడేమోనని: కానీ, అతని జాడ లేదు. అతని మనస్తత్వం కొంత వరకూ తెలుసు గనక, తిన్నగా వాళ్లింటికి వెళ్లాను.

వీధి గదిలో వాలు కుర్చీలోలో కూర్చుని ఉన్నాడు రామనాథం.

నన్ను చూసి "దా. కూచో." అన్నాడు.

ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని" ఇలా జరుగుతుం దనుకో లేదు. క్షమించు!" అన్నాను.

"ఇందులో నువ్వు చేసిందేముంది క్షమించ టానికి?'

"నువ్వు మొదట్లోనే మంత్రిగార్ని వద్దన్నావు. నేనే బలవంతంగా నీతో ఒప్పించాను. అయినా మంత్రిగారు ఇంత గందరగోళం సృష్టిస్తాడని ఎలా అను కుంటాం?"

"అతను ప్రత్యేకంగా సృష్టించిన గందరగోళ మేమీ లేదు. తన స్థాయికి తగ్గట్టుగా తాను ప్రవర్తించా డంతే. తప్పు అతనిది కాదు. అతన్ని పిలిపించుకున్న మనదే తప్పు. పిలిస్తేనే అతను వచ్చాడు గానీ తనంత తానుగా రాలేదు కదా ! ప్రతిదానికి తగుదునమ్మా అంటూ రాజకీయ నేతలు తయారయి పోతుంటారని వాళ్ళను ఆడిపోసుకుంటాం గానీ, కావాలని ప్రజలే ఏదో ఆశించి వాళ్లను తెచ్చి నెత్తి కెక్కించుకుంటారు. పిలిచింతర్వాత రాకపోతే అదో తప్పు. ఓట్లిచ్చి గెలిపించిన ప్రజల్ని పట్టించుకోవటం లేదని వాళ్ళనే నిందిస్తారు. సందర్భ శుద్ధి లేకుండా హోదాని చూసి వ్యక్తుల్ని ఆహ్వానిస్తే ఏ సభైనా రసాభాస అయి తీరుతుంది. అందుకు ప్రత్యక్ష నిదర్శనం ఈనాటి మన సభే !" అంటూ విషయాన్ని ముగించాడు రామనాథం.

అతని వాదంలో కాదనదగ్గ అంశమేమీ కనిపించలేదు నాకు. ●